# సాక్షి అనకాపల్లి

బుధవారం । 23 । జూలై । 2025






## జ్వరాలపై ప్రత్యేక దృష్టి

జ్వరాలను నివారించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా మలేరియా అధికారి వరహాల దొర సూచించారు. 8లో



## విద్యా వ్యాపారంపైనే నా యుద్ధం

కార్పొరేట్ విద్యా వ్యవస్థపై పోరాటంగా 'యూనివర్సిటీ పేపర్ లీకేజ్'చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు ఆర్.నారాయణమూర్తి తెలిపారు. 8లో

## వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు జిల్లాలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండి, తేలికపాటి వర్షంపడే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం తెలిపారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 32.8 నుంచి 34.0, కనిష్ట ఉష్ణోగ్రతలు 25.8 నుంచి 26.7 డిగ్రీలుంటాయన్నారు.

## న్యూస్‌రీల్

### 26న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

బీచ్‌రోడ్డు(విశాఖ): జెడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన ఈనెల 26వ తేదీన జిల్లా పరిషత్ స్థాయీ సమావేశాలు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో పి.నారాయణ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ సమావేశ మందిరంలో 1 నుంచి 7 స్థాయీ సంఘాల సమావేశాలను ఉదయం 10 గంటల నుంచి జరుగుతాయని పేర్కొన్నారు.

### ఆక్రమణకు గురైన చెరువు గర్భం స్వాధీనం



వెంకన్నపాలెంలో ఆక్రమణకు గురైన చెరువును పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

చోడవరం: మండలంలోని వెంకన్నపాలెం పంచాయతీ పరిధి సబ్బవరం వెళ్లే దారిలో ఆక్రమణకు గురైన చెరువు గర్భాన్ని మంగళవారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ చెరువును ఆక్రమించి కొందరు ప్లాట్లు వేశారని అదే గ్రామానికి చెందిన పంచాయతీ వార్డు మెంబర్లు పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ చెరువు కింద ఆయకట్టు భూమి కూడా ఉందని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఆదేశించడంతో చోడవరం తహసీల్దార్ రామారావు తనసిబ్బందితో మంగళవారం చెరువును పరిశీలించారు. చెరువు ఆక్రమణకు గురైందని గుర్తించిన రెవెన్యూ అధికారులు వెంటనే స్వాధీనం చేసుకున్నారు. చెరువు గర్భంలో కొలతలు వేసి హద్దులునిర్ణయిస్తూ ఎరుపు రంగు జెండాలను ఏర్పాటు చేశారు. చెరువు గర్భాలను ఆక్రమిస్తే చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రామారావు హెచ్చరించారు.

### 41 మందితో జిల్లాస్థాయి అకడమిక్ ఫోరం

అనకాపల్లి టౌన్: రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు 41 మందితో జిల్లాస్థాయి అకడమిక్ ఫోరంను ఏర్పాటు చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఫోరంలో చైర్మన్‌గా డీఈవో, అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్‌గా అనకాపల్లి సమగ్ర శిక్ష అధికారి ఆర్.జయ ప్రకాష్, వైస్ చైర్‌పర్సన్‌గా భీమునిపట్నం డైట్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, ప్రాథమిక పాఠశాలలకు మెంబర్ కన్వీనర్‌గా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గర్నమెంట్ ఎగ్జామ్స్ ఎ. శ్రీధర్ రెడ్డి, ఉన్నత పాఠశాలలకు మెంబర్ కన్వీనర్‌గా జిల్లా ఉమ్మడి పరీక్ష నిర్వహణ కార్యదర్శి పి.సత్యనారాయణ నియమితులయ్యారని పేర్కొన్నారు. వీరితో పాటు ఒక్కొక్క సబ్జెక్టుకు నలుగురు చొప్పున సబ్జెక్టులో నిష్ణాతులైన వారిని పర్యవేక్షణకు నియమించినట్టు తెలిపారు. అదే విధంగా ఆయా మండలాల్లో మండల అకడమిక్ ఫోరంలను ఏర్పాటు చేశామన్నారు. ఈ ఫోరం ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది హాజరు, సమయపాలన, విధి నిర్వహణ, బోధన, క్రమశిక్షణ, లక్ష్యసాధన, పాఠశాలల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తుందని తెలిపారు.

### మా భూముల జోలికొస్తే సహించం



ఆర్.భీమవరంలో ఆందోళన చేస్తున్న రైతులు

బుచ్చెయ్యపేట: తాతల కాలం నుంచి భూములను నమ్ముకుని జీవిస్తున్నాం, మేం సాగు చేస్తున్న భూములను బలవంతంగా లాక్కోవడానికి చూస్తే ఉద్యమిస్తామని ఆర్.భీమవరం, చిన భీమవరం గ్రామాల రైతులు తెలిపారు. మంగళవారం రెండు గ్రామాల రైతులు తమ గ్రామాల్లో ఆందోళన చేసి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటు పేరిట సాగు భూములను లాక్కొని మాకు అన్యాయం చేయడం తగదని ఆవేదన వ్యక్తం చేశారు. మాకు పరిశ్రమలు వద్దు,మా భూములు మాకు ముద్దు,బలవంత భూ సేకరణ వద్దు, వ్యవసాయం ముద్దు అంటూ రైతులు నినాదాలు చేశారు. పలు పార్టీలకు చెందిన నాయకులు,రైతులు ఆందోళనలో పాల్గొన్నారు. రెండు గ్రామాల రైతులకు మద్దతుగా రైతు కూలీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

**వర్షాకాలంలోనూ అదే స్పీడ్** 8లో

# అర్హత లేని వైద్యులు... గాల్లో ప్రాణాలు

యలమంచిలిలో ప్రభుత్వ పీహెచ్‌సీల్లో ఫార్మసిస్టులుగా పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు వైద్యుల అవతారం ఎత్తారు. అనుమతిలేకుండా ఆస్పత్రి ఏర్పాటు చేసి,అర్హత లేకపోయినా వైద్యం చేస్తూ దర్జాగా రెండు చేతులా సంపాదిస్తున్నారు. ఓ ఫార్మసిస్ట్ నిర్వహిస్తున్న ఆస్పత్రిలో డ్రగ్ కంట్రోల్ అథారిటీ అనుమతి లేకుండా పెద్ద మొత్తంలో అల్లోపతి మందులు నిల్వ ఉంచారు.మరో మహిళా ఫార్మసిస్టు ఇంటి వద్దనే వైద్యం చేస్తున్నారు.

- అనకాపల్లి,చోడవరం,నర్సీపట్నం,యలమంచిలి పట్టణాలు సహా మండల కేంద్రాల్లో ఆయుర్వేద,హోమియో వైద్యులు నిబంధనలకు విరుద్ధంగా రోగులకు అల్లోపతి వైద్యం చేయడంతో పాటుహైడోస్ యాంటీబయోటిక్స్,పెయిన్ కిల్లర్స్,స్టెరాయిడ్ ఇంజక్షన్లు ఇస్తున్నారు.నకిలీ వైద్యులు,అర్హత కలిగిన వైద్యుల్లాగానే మందుల చీటీలు రాసిస్తున్నారు.
- యలమంచిలిలో అనుమతిలేని ఆస్పత్రులతో పాటు,ఇతరులు నిబంధనలకు విరుద్ధంగా డయాగ్నోస్టిక్ సెంటర్లు నెలకొల్పి రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.



యలమంచిలిలో అనుమతి లేని ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలు



యలమంచిలిలో ప్రభుత్వ ఫార్మసిస్టు ఏర్పాటు చేసిన అనుమతి లేని ఆస్పత్రిలో రోగులకు సెలైన్ ఎక్కిస్తున్న దృశ్యం

- జిల్లాలో అనుమతిలేని ఆస్పత్రులు 400 పైనే
- అర్హత లేకున్నా డాక్టర్లుగా చెలామణి
- యలమంచిలిలో వైద్యుల అవతారం ఎత్తిన ప్రభుత్వ ఫార్మసిస్టులు
- కొన్నిచోట్ల గుట్టుగా అబార్షన్లు, కుటుంబ సంక్షేమ శస్త్ర చికిత్సలు
- అడ్డగోలుగా యాంటీబయోటిక్స్, పెయిన్ కిల్లర్ల వినియోగం
- పైసల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం
- పర్యవేక్షణ గాలికొదిలిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

యలమంచిలి రూరల్:

అనారోగ్యం బారిన పడితే రోగులు అందుబాటులో ఉన్న ఆస్పత్రులకు వెళతారు. జిల్లాలో చాలా అనుమతి లేని ప్రైవేట్ ఆస్పత్రులుండగా వాటిలో అర్హతలేని వైద్యులు చికిత్సలు చేస్తున్నారు. దీంతో సరైన వైద్యం లభించకపోగా, ఒక్కోసారి రోగి ప్రాణాల మీదకు వస్తోంది. ఇవేమీ జిల్లా వైద్య ఆరోగ్య, ఓషధ నియంత్రణ శాఖల అధికారులకు కనిపించడంలేదు. అనుమతిలేని ఆస్పత్రులు,ల్యాబ్‌లు,మందుల దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి ఎన్ఎంసీ,ఏపీ క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పర్యవేక్షణ గాలికొదిలేశారన్న ఆరోపణలున్నాయి.

**మిడి మిడి జ్ఞానంతో..**

కొందరు నకిలీలు ఎలాంటి అర్హతా లేకుండా మిడి మిడి జ్ఞానంతో వైద్యం చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నుంచి అనుమతి తీసుకునేది ఒకదానికైతే వారు చేస్తున్నది మరొకటి. మరి కొందరు అనుమతి లేకుండా వైద్యాన్ని కొన్నేళ్లుగా చేస్తున్నారు. వైద్యం వికటించి రోగి ప్రాణాల మీదకు వస్తే తప్ప నకిలీల బండారం బయటపడడం లేదు. అలాంటి ఆస్పత్రులపై ఫిర్యాదులు వస్తే తప్ప అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.వైద్య ఆరోగ్యశాఖ అనుమతి లేకుండా జిల్లాలో 400కు పైగానే ఆస్పత్రులు వివిధ పేర్లతో అక్రమంగా కొనసాగుతున్నాయని సమాచారం.కొందరు ఆర్ఎంపీలు ప్రాథమిక చికిత్స మాత్రమే చేసి,వారి వద్దకు వస్తున్న రోగులకు వైద్య సలహాలు మాత్రమే ఇవ్వాల్సి ఉండగా,సెలైన్ పెట్టడం,మందుల చీటీ రాయడం వంటివి చేస్తున్నారు.అర్హత లేకుండా ప్రిస్క్రిప్షన్ రాయడం నేరం.అలాగే తమ పేర్ల ముందు డాక్టర్ అని రాసుకోకూడదు.కానీ కొందరు యథేచ్ఛగా నిబంధనలు అతిక్రమిస్తున్నారు.ప్రథమ చికిత్సలు మాత్రమే చేయాల్సిన ఆర్ఎంపీలు, పీఎంపీలు దవాఖానాల పేరుతో బోర్డులు ఏర్పాటు చేసుకుని మరీ వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.ప్రైవేటు ఆస్పత్రులతో కుమ్మక్కై కేసులను రిఫర్ చేస్తూ కమీషన్లు దండుకుంటున్నారు. కొన్ని చోట్ల అబార్షన్లు కూడా చేస్తున్నారు.ఇవన్నీ తెలిసినా వైద్య శాఖ అధికారులు మాత్రం చూసీచూడనట్టు వ్యవహరించడం వెనుక ఆంతర్యం బహిరంగ రహస్యమే.

**నిబంధనలు ఇవీ..**

కొత్తగా ప్రైవేటు ఆస్పత్రి ఏర్పాటు చేయాలంటే వైద్యారోగ్యశాఖ అనుమతి పొందాలి.వైద్యశాల పేరుతో రిజిస్ట్రేషన్,తెలుగు,ఆంగ్ల భాషల్లో ధరల పట్టిక బోర్డులు,స్కానింగ్ ఇమేజింగ్ సెంటర్,ల్యాబ్,ఫైర్ సేఫ్టీ,పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సర్టిఫికెట్లు,బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంటు ధ్రువీకరణ పత్రం ఉండాలి.

అర్హులైన వైద్యులు,స్టాఫ్‌నర్సులు,పారామెడికల్ సిబ్బందిని నియమించుకోవాలి.రికార్డులు పక్కాగా నిర్వహించే కంప్యూటర్ వ్యవస్థ,రోగికి సంబంధించిన కేస్ షీట్లు ఐదేళ్ల పాటు భద్రపరిచే వ్యవస్థ ఏర్పాటు చేయాలి. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టినప్పుడు ఈ నిబంధనలు సక్రమంగా పరిశీలించడం లేదనే ఆరోపణలున్నాయి.

**దారుణాలు ఇలా..**

యలమంచిలి మండలం పద్మనాభరాజుపేటకు చెందిన రైతు జ్వరం వస్తే సమీప గ్రామంలో ఉన్న ఒక ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు వెళ్లాడు. ఆ వైద్యుడు గ్లూకోజ్ బాటిల్‌తో పాటు యాంటీ బయోటిక్ ఇంజెక్షన్ ఇచ్చాడు.కానీ రైతుకు కామెర్ల వ్యాధి అప్పటికే ఉంది.అది కాస్త మరింత ముదరడంతో మూడు రోజుల తర్వాత పరిస్థితి విషమించింది.యలమంచిలిలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్తే వారు ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలని సూచించారు.ప్రభుత్వాస్పత్రికి వెళ్లిన కొద్ది సేపటికే రైతు ప్రాణాలు కోల్పోయాడు. వచ్చీ రాని వైద్యం కారణంగా ఓ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది.

- రాంబిల్లి మండలం గోకివాడకు చెందిన బీమా ఏజెంట్ జ్వరం,జలుబు,దగ్గుతో యలమంచిలి భవనం వీధిలో ఉన్న ఒక ప్రైవేటు ఆస్పత్రికి వైద్యం కోసం వెళ్లారు.కోవిడ్ సోకిందన్న అనుమానం వ్యక్తం చేసిన ఏజెంట్‌కు వైద్యుడు మరేమీ పర్వాలేదు అని ధీమా ఇవ్వడంతో అతడు ఎలాంటి చికిత్స తీసుకోలేదు.ఫలితంగా ప్రాణాలు కోల్పోయాడు.
- యలమంచిలి రైల్వేస్టేషన్ రోడ్డులో ఓ ఆస్పత్రిలో ఎలాంటి అర్హత లేకుండా చిన్నపిల్లలకు వైద్యం అందిస్తున్నారు.గతంలో మాడుగుల మండలం నుంచి వైద్యం కోసం ఆడ శిశువును ఈ ఆస్పత్రికి తీసుకొచ్చిన తల్లిదండ్రులకు గర్భశోకం తప్పలేదు.వచ్చీరాని వైద్యంతో తమ బిడ్డ మృతికి కారణమయ్యారంటూ తల్లిదండ్రులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు.
- ఇలాంటి ఘటనలు జిల్లాలో నిత్యం ఎక్కడో ఓ చోట జరుగుతూనే ఉన్నాయి. కొందరు నకిలీ వైద్యులు వచ్చీరాని వైద్యంతో అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నారు. వీటిని అరికట్టాల్సిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీలు మరిచిపోవడంతో ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.వివిధ కారణాలతో ఏడాదిన్నర కాలంలో జిల్లాలో నలుగురు డీఎంహెచ్‌వోలు మారడం కూడా ప్రైవేటు ఆస్పత్రుల ఆగడాలను అడ్డుకోకపోవడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది.

**తనిఖీలు చేస్తాం**

జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి.త్వరలో జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో తనిఖీలు చేసి నిబంధనలు పాటించని ఆస్పత్రుల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం.ప్రభుత్వ ప్రాథమిక వైద్య కేంద్రాల్లో ఫార్మసిస్టులుగా పనిచేస్తున్న కొందరు యలమంచిలిలో ప్రైవేటు వైద్యం చేస్తున్న విషయంపై విచారణ జరిపి చర్యలు తగు తీసుకుంటాం. అర్హతకు మించి వైద్యం చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– ఎం.హైమావతి,డీఎంహెచ్‌వో

# టీడీపీ దురాగతాలకు రిటర్న్ గిఫ్ట్ తప్పదు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

- చంద్రబాబు మోసాలను ఇంటింటికీ వివరిద్దాం
- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి సీఎం చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరిద్దామని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపాలిటీలో మంగళవారం 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గణేష్ హాజరై మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో కూటమి నేతలు విఫలమయ్యారన్నారు. చంద్రబాబు మోసాలను ప్రశ్నిస్తే కేసులు బనాయించి, దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఇళ్లు కూల్చడం, హత్యాయత్నాలు వంటి చర్యలతో టీడీపీ నాయకులు తమకు కొత్త పాఠాలు నేర్పుతున్నారన్నారు. 2029లో జగనన్న సునామీ రాబోతుందన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే వారి దుశ్చర్యలకు రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని హెచ్చరించారు. నిరుద్యోగ భృతి అమలుకు నోచుకోలేదన్నారు. తల్లికి వందనం అసంపూర్తిగా ఇచ్చారన్నారు. సాగు సమయం వచ్చినప్పటికీ అన్నదాత సుఖీభవకు దిక్కు లేదన్నారు. అందుకే బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ పేరుతో సూపర్ సిక్స్ పథకాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలే వైఎస్సార్ సీపీకి మూల స్తంభాలన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం జగనన్న ప్రత్యేక దృష్టి సారించారన్నారు. జగనన్న మాట ఇచ్చాడంటే దానికి ఎంతగా కట్టుబడి ఉంటాడో ప్రజలందరికీ తెలుసన్నారు. రాబోయే ఎన్నికల్లో జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు.

**నర్సీపట్నంలో రాక్షస పాలన...**

ఈవీఎంల ద్వారా అధికారం చేపట్టిన కూటమి నేతలు నర్సీపట్నంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల సన్యాసిపాత్రుడు విమర్శించారు. ఎవరిని ఎప్పుడు అరెస్ట్ చేసి జైలుకు పంపాలో జాబితాను సిద్ధం చేసుకుని రాక్షస పాలన కొనసాగిస్తున్నారన్నారు. రాయి క్వారీల్లో టాక్స్ వసూలు చేస్తున్నారన్నారు. మాకవరపాలెం మండలం యరకన్న పాలెంలో ఎవరి ప్రయోజనాలు కోసం రోడ్డు వేశారో త్వరలోనే బయటకు వస్తుందన్నారు. ఎమ్మెల్యేగా ఎవరు పోటీ చేసినా గెలుపు నిర్ణయించేది మున్సిపాలిటీ ప్రజలేనని, దీన్ని దృష్టిలో పెట్టుకొని అన్ని వార్డుల్లో నాయకులు సమష్టిగా పని చేయాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు మాట్లాడారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గణేష్ పార్టీ నాయకులతో కలిసి క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. పార్టీ సీనియర్ నాయకుడు గవిరెడ్డి స్వామినాయుడు, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోడూరు నల్లరాయి క్వారీ పరిశీలన

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం జి.కోడూరు నల్లరాయి క్వారీని మైనింగ్ విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ డి.అశోక్ కుమార్ మంగళవారం పరిశీలించారు. క్వారీ నిర్వహణ వల్ల చుట్టు పక్కల సాగుదారులు నష్టపోయే ప్రమాదం ఉందని, తక్షణమే క్వారీని నిలుపుదల చేయాలని బొంతు రమణ మైనింగ్ అధికారులకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీంతో అసిస్టెంట్ డైరెక్టర్ స్వయంగా క్వారీని పరిశీలించారు. సాగుదారులను విచారించారు. కొన్ని క్వారీల్లో ఇప్పటికే బ్లాస్టింగ్ అనుమతులు రద్దు చేశారని, ఈ క్వారీలో నిర్వాహకులు బ్లాస్టింగ్ చేస్తున్నారని రమణ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారులకు నివేదించిన అనంతరం చర్యలు తీసుకుంటామని విజిలెన్స్అసిస్టెంట్ డైరెక్టర్ ఫిర్యాదుదారులకు తెలిపారు.



ఫిర్యాదుదారుడు రమణతో మాట్లాడుతున్న మైనింగ్ విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్ కుమార్

# త్వరితగతిన పునరావాస ఏర్పాట్లు

- కలెక్టర్ విజయకృష్ణన్
- బల్క్‌డ్రగ్‌పార్క్ పనులు పరిశీలన



బోదిగల్లంలో పునరావాస భూములను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్



సీహెచ్ఎల్ పురం వద్ద సేకరించే భూములు పరిశీలిస్తున్న కలెక్టర్

నక్కపల్లి: మండలంలో విశాఖ, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితుల కోసం బోదిగల్లం వద్ద ఎంపిక చేసిన ప్రాంతాల్లో పునరావాస ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె నక్కపల్లి మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. పరిశ్రమల స్థాపన కోసం భూసేకరణ జరిగిన గ్రామాల్లో నివాస ప్రాంతాలు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు పెదబోదిగల్లం వద్ద 160 ఎకరాలను కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే 100 ఎకరాలకు పైగా భూములు రైతులనుంచి నేరుగా కొనుగోలు చేశారు. కొనుగోలు ప్రక్రియ పూర్తయిన భూముల్లో లేఅవుట్లు రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించే పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇక్కడ సుమారు 700 మందికి పైగా నిర్వాసితులకు ఇళ్లస్థలాలు కేటాయించి పునరావాసం కల్పించాల్సి ఉందన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, వాడుకనీరు, విద్యుత్ సదుపాయాలు కల్పించాలన్నారు. పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసి, నిర్వాసితులందరినీ వారి వారి ప్రాంతాలనుంచి ఖాళీ చేయించి ఇక్కడకు తరలించాల్సి ఉంటుందన్నారు. బల్క్‌డ్రగ్ పార్క్ కోసం అదనంగా భూములు సేకరించే జానకయ్యపేట, సీహెచ్ఎల్ పురం, పెదతీనార్ల, చినతీనార్ల గ్రామాలతోపాటు, బల్క్‌డ్రగ్‌పార్క్ పనులు జరుగుతున్న రాజయ్యపేట, బోయపాడు, చందనాడ, పాటిమీద, అమలాపురం గ్రామాలను ఆమె సందర్శించారు. అలాగే స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించిన భూములతోపాటు, క్యాప్టివ్‌పోర్టు నిర్మించే భూములను పరిశీలించారు. బల్క్ డ్రగ్ పార్క్ కోసం ఏపీఐఐసీ అధికారులు చేపట్టిన పనులు పరిశీలించి, చురుగ్గా పూర్తి చేయాలన్నారు. రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిలు తదితర పనులను ఏపీఐఐసీ అధికారులు, ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఏపీఐఐసీ అధికారులు,రెవెన్యూసిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సేకరించిన భూముల్లో జరుగుతున్న పనులకు సంబంధించి క్లైమ్స్‌పై ఆరాతీశారు. రైతులకు చెల్లించాల్సిన పేమెంట్స్‌ను గురించి తెలుసుకున్నారు.అదనపు భూసేకరణ విషయమై రైతులతోమాట్లాడి అవగాహన కల్పించి ముందుకు సాగాలని సూచించారు. పునరావాస ఏర్పాట్ల విషయంలోప్రభుత్వంనుంచి ఒత్తిడి ఉందని, త్వరగా పూర్తిచేయాలన్నారు. నిర్వాసితుల తరలింపు పూర్తయితే బల్క్‌డ్రగ్‌పార్క్, స్టీల్‌ప్లాంట్ పనుల విషయంలో ప్రభుత్వం ముందుకు వెళ్లే అవకాశాలున్నాయని తెలిపారు. ఈమె వెంట నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ, జోనల్‌మేనేజర్ నర్సింగరావు తహసీల్దార్ నర్సింహమూర్తి,ఏపీఐఐసీ సిబ్బంది ఉన్నారు.

**రైతులు అంగీకరించడం లేదు**

నక్కపల్లి వచ్చిన కలెక్టర్‌ను మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కురందాజు నూకరాజు తదితరులు కలిశారు. జానకయ్యపేట, సీహెచ్ఎల్ పురం గ్రామాల్లో బల్క్‌డ్రగ్ పార్క్‌కు అదనంగా భూములు ఇచ్చేందుకు రైతులు అంగీకరించడం లేదని వారు కలెక్టర్‌కు తెలిపారు. రైతులంతా తీవ్ర వ్యతిరేకత చూపిస్తున్నారని, ఈవిషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

## స్వయంభూ వినాయకుని హుండీ ఆదాయం రూ.1.39 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న అధికారులు

చోడవరం: ప్రఖ్యాతిగాంచిన చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామివారి ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. దేవదాయశాఖ అధికారులు బి. వసంతకుమార్, ఎస్.వి.వి. సత్యనారాయణమూర్తి పర్యవేక్షణలో శ్రీవారి సేవా సభ్యుల బృందం హుండీ ఆదాయాన్ని లెక్కించింది. రూ. 1,39,426 ఆదాయం లభించినట్టు ఈవో సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానఅర్చకుడు కొడమంచిలి చలపతిరావు, ఆలయ కమిటీ చైర్మన్ పసుమర్తి సాంబ పాల్గొన్నారు.

## హైడ్రో పవర్ ప్లాంట్లకు వ్యతిరేకంగా పోరాటం

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న



చింతలపూడిలో గిరిజనులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు వెంకన్న, దొర

దేవరాపల్లి: అదానీ హైడ్రో పవర్ ప్లాంట్లకు వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న, మండల కార్యదర్శి బి.టి. దొర పిలుపు నిచ్చారు. మండలంలోని చింతలపూడి పంచాయతీ కొత్తూరు జంక్షన్‌లో గురువారం జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ తామరబ్బ, చింతలపూడి గ్రామాల్లో మంగళవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ బహిరంగ సభలో గిరిజనులతో పాటు రైవాడ ఆయకట్టు రైతులు, నీటి సంఘాల చైర్మన్లు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదానీ హైడ్రో పవర్ ప్రాజెక్టుకు చింతలపూడి, సమ్మెద, పల్లపుకొడాబు గ్రామాల్లో 600 ఎకరాలకు పైబడి, మారిక గ్రామంలో 213 ఎకరాలు సేకరించి, 900 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి చేయాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. దీంతో ఈ ప్రాంత గిరిజనులు భయాందోళనలు చెందుతున్నారని తెలిపారు. పెదకోట సమీపంలో రేగుపాలెం ప్రాంతంలో 1800 మెగావాట్ల సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మించాలని నిర్ణయించినట్టు చెప్పారు. ఈ రెండు ప్రాజెక్టులు రైవాడ రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియాలో ఉన్నాయని, వీటిని నిర్మిస్తే రైవాడ ఆయకట్టు భూములు బీడు వారిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైవాడ ప్రాజెక్టు నుంచి విశాఖ నగర ప్రజలకు తాగునీటి సరఫరాకు సైతం అంతరాయం ఏర్పడుతుందన్నారు. గిరిజనులు చేపడుతున్న ఆందోళనకు రైవాడ ఆయకట్టు రైతులు మద్దతు తెలపాలని కోరారు. చింతలపూడిలో గురువారం జరిగే బహిరంగ సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు తదితరులు హాజరవుతారని చెప్పారు.

## క్లుప్తంగా

### వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ సమావేశాలకు ఆహ్వానం



గుడివాడ అమర్‌నాథ్‌ను ఆహ్వానిస్తున్న ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు పూర్ణచంద్రరావు

బీచ్ రోడ్డు: త్వరలో జరగబోయే వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా స్థాయి సమావేశాలకు హాజరు కావాలని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూర్ణ చంద్రరావు ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం అమర్‌నాథ్‌ను మిందిలో కలిసి ఆహ్వానం లేఖ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోడి శివరామ కృష్ణ, పూడి మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి హాకీ పోటీలకు నలుగురు ఎంపిక



జాతీయ సబ్ జూనియర్ హాకీ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

యలమంచిలి రూరల్: జిల్లాకు చెందిన నలుగురు హాకీ క్రీడాకారులు జాతీయ స్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీలకు ఎంపికైనట్టు జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి కొఠారు నరేష్ తెలిపారు. పండూరి భరత్, చరణ్, దేవేందర్ వెంకట్, స్వరూప్‌లు ఈ నెల 28 నుంచి చెన్నైలో జరగనున్న హాకీ పోటీల్లో ఏపీ జట్టు తరఫున పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారుల్లో నక్కపల్లికి చెందిన ఇద్దరు, అనకాపల్లి, యలమంచిలి పట్టణాల నుంచి ఒక్కొక్కరు ఉన్నారని చెప్పారు.

### విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అవసరం



విద్యార్థులతో కల్నల్ హరీందర్ సింగ్ మానిక్, విజయ్ ప్రకాష్

పాయకరావుపేట: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలని 3వ ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ హరీందర్ సింగ్ మానిక్ పేర్కొన్నారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థలో స్కూల్ కెప్టెన్, హౌస్ కెప్టెన్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. చదువుకునే వయసులోనే బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని పదేళ్ల పాటు కష్టపడితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్ ద్వారా కల్నల్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. విద్యార్థులతో నాయకత్వ లక్షణాలను సక్రమంగా నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్.మూర్తి, ప్రధానోపాధ్యాయురాలు ఎం.అపర్ణ, దాసరి శ్రీనివాస్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలోనూ అదే స్పీడ్..!



## భానుడు భగభగల కారణంగా పెరిగిన విద్యుత్ వినియోగం

- ఈపీడీసీఎల్ పరిధిలో రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం
- జూలైలో 16న 97 మిలియన్ యూనిట్ల విద్యుత్ వాడకం
- ఈనెలలో ప్రతిరోజూ సగటు వినియోగం 92 మి.యూనిట్లకు చేరిక

సాక్షి, విశాఖపట్నం: వరుణుడు కరుణించాల్సిన సమయంలో సూరీడు సుర్రుమనిపిస్తున్నాడు. వర్షంలో తడిసి ముద్దవ్వాల్సిన జనం.. ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వర్షాకాలం మొదలై నెలరోజులు గడిచినా ఉష్ణోగ్రతలు తారస్థాయిలో నమోదవుతున్నాయి. ఉష్ణోగ్రతలు 36 నుంచి 38 డిగ్రీల మధ్యలో నమోదవుతున్నా.. ఉక్కబోత మాత్రం 45 నుంచి 48 డిగ్రీల ప్రభావం చూపిస్తోంది. వేడి తట్టుకోలేక జనం ఉదయం నుంచి రాత్రి వరకూ ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లకే అతుక్కుపోతుండటంతో విద్యుత్ మీటర్లు గిర్రుగిర్రుని తిరుగుతున్నాయి. ఈపీడీసీఎల్ పరిధిలో జూలై నెలలో సాధారణం కంటే విద్యుత్ వినియోగం రికార్డు స్థాయిలో పెరిగిపోయింది. చరిత్రలో ఎన్నడూ లేనంతగా డిమాండ్ పెరుగుతుండటంతో దానికి అనుగుణంగా విద్యుత్ సరఫరా చేసేందుకు అధికారులు అష్టకష్టాలు పడుతున్నారు. లోడ్ పెరుగుతుండటంతో సరఫరాలోనూ లోపాలు తలెత్తుతున్నాయి.

**గరిష్ట స్థాయికి చేరుకుంటున్న డిమాండ్**


ఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ వాడకం అధికంగా జరుగుతుండటంతో సరఫరాకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకునేందుకు ఈపీడీసీఎల్ అధికారులు అష్టకష్టాలు పడుతున్నారు. ఐదు సర్కిళ్ల పరిధిలో జూలై నెలలో ప్రతి గంటకు 3,700 నుంచి 3,800 మెగావాట్ల గరిష్ట డిమాండ్ ఉంటుంది. కానీ ఈ ఏడాది జూలైలో మాత్రం రికార్డు స్థాయికి చేరుకుంది. ఈ నెల 16న రాత్రి 9.38 గంటల సమయంలో ఏకంగా 4,737 మెగావాట్లకు చేరుకోవడంతో అధికారులు సైతం అవాక్కయ్యారు. గతేడాది ఇదే సమయంలో 3,716 మెగావాట్లు మాత్రమే వినియోగం జరగగా.. ఈ సారి 1000 మెగావాట్స్ అదనపు భారం పడింది. డిమాండ్‌కు మించి సరఫరా ఉండటంతో అధికారులు లోటు భర్తీ చేసేందుకు ఎప్పటికప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా రాత్రి 10 గంటల సమయంలోనూ డిమాండ్ పీక్స్‌కు చేరుకుంటోంది. ఒకే సమయంలో అందరూ ఏసీలు, కూలర్లు ఆన్ చేస్తుండటంతో కొన్ని ప్రాంతాల్లో లోడ్ పెరిగి ట్రిప్ అవుతూ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ఇదే అదనుగా కోతలకు ఈపీడీసీఎల్ అధికారులు పనిచెప్పారు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో విద్యుత్ కోతలు కూడా గరిష్టంగానే పెరిగాయని ప్రజలు వాపోతున్నారు.

**ఈపీడీసీఎల్ పరిధిలో 10 రోజులుగా వినియోగం**

(మిలియన్ యూనిట్లు)

| తేదీ | 2024 | 2025 |
|---|---|---|
| 12- జూలై | 76.04 | 89.62 |
| 13- జూలై | 73.38 | 88.48 |
| 14- జూలై | 72.69 | 92.37 |
| 15-జూలై | 72.86 | 94.82 |
| 16-జూలై | 75.08 | 97.09 |
| 17-జూలై | 75.32 | 93.44 |
| 18-జూలై | 71.92 | 90.55 |
| 19-జూలై | 65.46 | 88.73 |
| 20-జూలై | 62.65 | 84.87 |

**20 మిలియన్ యూనిట్లు అదనంగా..**



ఈపీడీసీఎల్ పరిధిలో జూలై నెలలో ప్రతి రోజూ సగటున 72 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతుంటుంది. అయితే భానుడి ప్రతాపంతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిపోయింది. జూలై 10 నుంచి కరెంట్ వినియోగం భారీగా పెరుగుతూ వస్తోంది. సగటు విద్యుత్ వినియోగం రోజుకు 82 నుంచి 92 మిలియన్ యూనిట్లుగా మారిపోయింది. జూలై 16న ఏకంగా 97 మిలియన్ యూనిట్లు విద్యుత్ వాడేశారంటే.. ఎండ తీవ్రత ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

# అయోధ్య పేరిట వ్యాపారం?

- ఫిర్యాదు చేసిన భద్రాచలం దేవస్థానం అధికారులు
- డబ్బుల వసూళ్లు తప్పుడు ప్రచారం అంటున్న నిర్వాహకులు




నగదు వసూళ్ల రసీదు

బీచ్‌రోడ్డు: ఉత్తరాంధ్ర ప్రజల కోసం నగరంలో ఏర్పాటు చేసిన అయోధ్య రామమందిర నమూనా వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. విశాఖ బీచ్ రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం ఎదురుగా ఈ సెట్‌ను గరుడ అనే సంస్థ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ సెట్ ఆధారంగా అయోధ్య పేరిట వ్యాపారం చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వారి వ్యాపారంలో భద్రాచలం దేవస్థానాన్ని వాడుకోవటంపై ఆ దేవస్థానం ఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతోపాటు సెట్ నిర్వాహకులపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. అయితే ఇదంతా తమపై కావాలనే కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారమని నిర్వాహకులు చెప్తున్నారు.

**కల్యాణోత్సవం పేరిట వసూళ్లు**

అయోధ్య రామ మందిరం సెట్ వేసి భక్తులకు రాముని దర్శనం కల్పించారు. అంతవరకు బాగానే ఉంది. ఈ నెలాఖరుకు ఈ సెట్‌ను తొలగించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అయోధ్య రాముని కల్యాణోత్సవానికి నిర్వాహకులు సిద్ధమయ్యారు. దీన్ని స్వయంగా భద్రాచలం దేవస్థానం పండితులచే నిర్వహించనున్నట్లు ప్రచారం చేస్తున్నారు. ఇందు కోసం భక్తుల నుంచి రూ.2,999 చొప్పున వసూళ్లు చేస్తుండటమే ఆరోపణలకు తావిచ్చింది.

**భద్రాచలం అధికారుల ఫిర్యాదు**

ఈ కల్యాణోత్సవంలో తమ దేవస్థాన పండితులు ఎవరూ పాల్గొనటం లేదని, ఇది కేవలం తప్పుడు ప్రచారమేనని భద్రాచలం దేవస్థానం అధికారులు మూడో పట్టణ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా తమ దేవస్థానం పేరు వాడుకుని భక్తుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**తప్పుడు రసీదుతో దుష్ప్రచారం**

ఈ వివాదంపై గరుడ సంస్థ నిర్వాహకుడు దుర్గాప్రసాద్ మంగళవారం మీడియా సమావేశం నిర్వహించి, మాట్లాడారు. కల్యాణోత్సవం కోసం భక్తుల నుంచి రూ.2,999 వసూళ్లు చేస్తున్నట్లు ప్రచారం చేస్తున్న రసీదును కొందరు కావాలనే తప్పుడు ప్రింటింగ్ చేశారని తెలిపారు. కొండవీటి రామలింగేశ్వరశర్మ ఆధ్వర్యంలో జరిగే ఈ కల్యాణోత్సవంలో భద్రాచలం నుంచి తీసుకొస్తున్న బ్రాహ్మణ బృందం పాల్గొంటుందని చెప్పామే తప్ప, భద్రాచలం దేవస్థానం పండితులచే నిర్వహిస్తున్నట్లు ఎక్కడా ప్రచారం చేయలేదన్నారు. తమపై కావాలనే ఎవరో చేస్తున్న తప్పుడు ప్రచారమని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

# పాత నేరస్తుడు అరెస్టు

- చోరీ సొత్తు రికవరీ

అనకాపల్లి టౌన్: దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడిని అరెస్ట్ చేసి, చోరీ సొత్తును రికవరీ చేసుకున్నట్లు డీఎస్పీ శ్రావణి తెలిపారు. మంగళవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిందితుడు బెజవాడ రాము మాడుగులలో హల్వా దుకాణంలో పనిచేస్తున్నాడు. అతనికి వచ్చే జీతం వ్యసనాలు, ఇంటి అవసరాలకు సరిపోవడంలేదు. దాంతో ఇళ్లలో దొంగతనాలకు పాల్పడేవాడు. ఈ క్రమంలో మాడుగులలో ఈ నెల 4న ఒక ఇంట్లో, అదే నెల 11వ తేదీన మామిడి లక్ష్మి ఇంట్లో దొంగతనాలు చేసి ఇరవై రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, 900 గ్రాముల వెండి వస్తువులు, రూ.1.90 లక్షలు ఎత్తుకుపోయాడు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితుడు మంగళవారం ఘాటీరోడ్డు జంక్షన్ వైపు వస్తుండగా, అక్కడ రెక్కీ నిర్వహిస్తున్న పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి మొత్తం బంగారం, నగదును రికవరీ చేసుకున్నారు. గతంలో పలు దొంగతనాలకు పాల్పడిన అతడిపై మొత్తం ఆరు కేసులు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో కె. కోటపాడు సీఐ పెదపునాయుడు, ఎస్ఐ జి. నారాయణరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణి

## జ్వరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి

- జిల్లా మలేరియా అధికారి వరహాలదొర

నాతవరం: వాతావరణంలో మార్పుల దృష్ట్యా గ్రామాల్లో ప్రబలుతున్న జ్వరాలను నివారించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా మలేరియా అధికారి కె. వరహాల దొర సూచించారు. మండలంలో ములగపూడి, నాతవరం, మర్రిపాలెం, వెన్నలపాలెం గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. అనంతరం నాతవరం పీహెచ్‌సీని సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. రక్త పరీక్షలు ముమ్మరంగా జరుగుతున్నాయని, మలేరియా, చికున్ గున్యా వంటి పరీక్షలకు సంబంధించి కిట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. జ్వరాలు ప్రబలిన గ్రామాల్లో వైద్య సిబ్బంది బృందాల వారీగా యుద్ధప్రాతిపదికన రక్త పరీక్షలు చేయాలన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది జె.సత్యనారాయణ, కె.వెంకటరమణ, నేతల రమణ, పోలుపర్తి బైరాగి పాల్గొన్నారు.

# విద్యా వ్యాపారంపైనే నా యుద్ధం

- ఆగస్టు 22న 'యూనివర్సిటీ పేపర్ లీకేజ్' విడుదల
- కార్పొరేట్ కళాశాలలు, కోచింగ్ సెంటర్ల దురాగతాలే ఈ చిత్ర కథాంశం
- పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న పీపుల్‌స్టార్

మద్దిలపాలెం: సమకాలీన సామాజిక సమస్యలనే కథాంశాలుగా తాను తీసిన చిత్రాలను ప్రేక్షకులు ఆదరించారని పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తి తెలిపారు. విద్యను వ్యాపారం చేస్తూ, ర్యాంకుల పేరుతో లీకేజీలకు పాల్పడుతున్న కార్పొరేట్ విద్యా వ్యవస్థపై పోరాటంగా 'యూనివర్సిటీ పేపర్ లీకేజ్' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు ఆయన వెల్లడించారు. తాను కథనందించి, దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని స్నేహచిత్ర పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మించినట్లు తెలిపారు. ఈ సినిమా ఆగస్టు 22న విడుదల కానుందని.. ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. ఈ చిత్ర పోస్టర్‌ను మంగళవారం ఏయూ బాస్కెట్‌బాల్ కోర్టు ప్రాంగణంలో విద్యార్థుల సమక్షంలో ఆవిష్కరించారు. అనంతరం చిత్ర విశేషాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

**తల్లిదండ్రుల కన్నీటిగాథలే ఇతివృత్తంగా..**

'విద్య, వైద్యం సేవా రంగంలో ఉన్నప్పుడే అందరికీ సమానంగా అందుతాయి. కానీ ఇప్పుడు విద్యను వ్యాపారంతో ముడిపెట్టి, కార్పొరేట్ విద్యకు శ్రీకారం చుట్టారు. కార్పొరేట్ కళాశాలలు మాది ఫస్ట్ ర్యాంక్, మాది బెస్ట్ ర్యాంక్ అంటూ ప్రచార మాధ్యమాల్లో హోరెత్తిస్తూ.. కాసుల కక్కుర్తితో పేపర్ లీకేజీలకు పాల్పడుతున్నాయి. దీని వల్ల కష్టపడి చదివిన పేద విద్యార్థి మంచి ర్యాంకు సాధించలేక చతికిలపడుతున్నాడు. మరోవైపు ఫీజులు కట్టలేక తల్లిదండ్రులు కిడ్నీలు అమ్ముకునే దుస్థితికి చేరుతున్నారు. వారి ఆవేదన చూసే ఈ చిత్ర నిర్మాణానికి పూనుకున్నాను'అని నారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థలు చేస్తున్న దోపిడీ కారణంగా, తమ పిల్లలకు మంచి విద్యను అందించాలనే తాపత్రయంలో సగటు సామాన్యుడు పడుతున్న కన్నీటి గాథలను ఈ చిత్రం ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించే ప్రయత్నం చేశానని వివరించారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు 'నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా..''వందనం వందనం ఆది గురువు అమ్మకు, సకలం బోధించే గురువులకు వందనం..'అనే పాటలను పాడి విద్యార్థులను ఉత్సాహపరిచారు.

# గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే చర్యలు

- ముద్దుర్తిలో డీపీవో సందీప్ ఆకస్మిక పర్యటన



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీపీవో సందీప్

చోడవరం: గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి పి. సందీప్ హెచ్చరించారు. మండలంలోని ముద్దుర్తి గ్రామంలో పారిశుధ్యం లోపించిందని, అధికారులు, పంచాయతీ పట్టించుకోలేదని స్థానికులు డీపీవోకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన వెంటనే ముద్దుర్తి గ్రామాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో అన్ని వీధులను పరిశీలించారు. మురుగు కాలువల్లో పూడిక తీయకపోవడం, రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు ఉండటంతో పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వీధులను శుభ్రం చేసే బాధ్యత పంచాయతీలపై ఉందన్నారు. అదేవిధంగా దోమల నివారణకు మందులు పిచికారీ చేయించాలని ఆదేశించారు. అనంతరం వెంకన్నపాలెం మెయిన్‌రోడ్డుపై కార్యదర్శి గంగాధర్ పర్యవేక్షణలో చేస్తున్న పారిశుధ్యం పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, పంచాయతీ సిబ్బంది, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# ఏకాగ్రతతోనే ఉన్నత లక్ష్యాల సాధన



కశింకోటలోని సెయింట్ జాన్స్ స్కూలులో విద్యార్థి కెప్టెన్, వైస్ కెప్టెన్లను అభినందిస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్ కుమార్

కశింకోట: విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే తమ ఉన్నత లక్ష్యాలను సాధించుకోగలరని 13 ఆంధ్ర ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్ కుమార్ అన్నారు. కశింకోటలోని సెయింట్ జాన్స్ స్కూలులో మంగళవారం గ్రూప్ కెప్టెన్స్, వైస్ కెప్టెన్స్, బాల బాలికల హెడ్‌ల నియామకం నిర్వహించారు. కల్నల్‌కు విద్యార్థులు కవాతు నిర్వహించి గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో ఎలా విజయం సాధించాలనే విషయమై అవగాహన కలిగించారు. ఎంపికైన కెప్టెన్, వైస్ కెప్టెన్లను అభినందించారు. స్కూల్ డైరెక్టర్ బత్తుల నోబుల్ కుమార్, కరస్పాండెంట్ బత్తుల అనురాధ, ప్రిన్సిపాల్ రూపానంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాల్లోకి వర్షపు నీరు



వ్యవసాయ కార్యాలయం ముందు వర్షం నీరు

నాతవరం: మండలంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి ప్రభుత్వ కార్యాలయాలు నీటి ముంపునకు గురయ్యాయి. ఇక్కడ ఎంపీడీవో కార్యాలయానికి ఇరువైపులా నీరు చేరడంతో ఇబ్బంది ఏర్పడింది. తహసీల్దార్ కార్యాలయం ఆవరణ చెరువును తలపించింది. వ్యవసాయ శాఖ గిడ్డంగి కార్యాలయం చుట్టూ నీరు చేరడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. ఎంఈవో కార్యాలయం ముందు భాగంలో నీరు నిలిచిపోయింది. బురదమయంగా ఉండటంతో కార్యాలయానికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటీవల కొద్దిపాటి వర్షం పడినా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నీరు చేరడంతో పనులు మీద వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా కార్యాలయాలు లోతట్టులో ఉండటంతో ఈ పరిస్థితి నెలకొంది.

# డ్రైవర్లు, కండక్టర్ల విశ్రాంతి భవనం ప్రారంభం



మహిళా కండక్టర్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

యలమంచిలి రూరల్: యలమంచిలి ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లో డ్రైవర్లు,కండక్టర్ల విశ్రాంతి భవనాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం సాయంత్రం ప్రారంభించారు.ఇక్కడ రాత్రి సమయాల్లో నిలిపి ఉంచే బస్సు డ్రైవర్లు,కండక్టర్ల సౌకర్యార్థం దీనిని అధికారులు ఇటీవల కొత్తగా నిర్మించారు.అనంతరం వృత్తిలో నిబద్ధతతో పని చేసి సంస్థకు లాభాలు తెచ్చేలా పనితీరు కనబర్చిన డ్రైవర్లు,కండక్టర్లను మంత్రి ప్రశంసించి, వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. యలమంచిలి కాంప్లెక్స్‌కు అన్ని ఎక్స్‌ప్రెస్‌లు రావడంలేదని,దీని వల్ల ఇక్కడి ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఎమ్మెల్యే ద్వారా మంత్రికి తెలియజేశారు. తగు చర్యలు తీసుకుంటానని మంత్రి చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్,రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వర్రావు,పలువుర ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

# నూకాంబిక సన్నిధిలో మంత్రి సవిత



అమ్మవారిని దర్శించుకున్న మంత్రి సవిత

అనకాపల్లి: స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారిని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు ఆలయ ఈవో సుధారాణి అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

- గవరపాలెం చాకలిపేటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంత్రి సవిత ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు.
- స్థానిక గవరపాలెం చాకలిపేటలో అనకాపల్లి జిల్లా కేంద్రంగా బీసీ మహిళా వసతి భవనాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.బాజ్జీ, ఎ.ఫణీంద్రకుమార్ మంత్రికి వినతిపత్రం అందజేశారు.

## క్లుప్తంగా

### జెడ్సీని కలిసిన కార్పొరేటర్లు



జెడ్సీ చక్రవర్తిని కలిసిన కార్పొరేటర్లు సునీత, ప్రసన్నలక్ష్మి దంపతులు

అనకాపల్లి: అనకాపల్లి జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె. చక్రవర్తిని వైఎస్సార్ సీపీ 82,83 వార్డుల కార్పొరేటర్లు మందపాటి సునీత జానకీరామరాజు, జాజుల ప్రసన్నలక్ష్మి రమేష్ దంపతులు మంగళవారం జోనల్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిపి సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ జోన్ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి పార్టీలకు అతీతంగా పని చేయాలని కోరారు. వర్షాలు పడుతున్న కారణంగా ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డ్రైనేజీల్లో మురుగు నిలిచిపోకుండా తగు చర్యలు తీసుకోవాలని పారిశుధ్య కార్మికులకు సూచనలివ్వాలని కోరారు.

### రేపు అవినీతి నియంత్రణపై సదస్సు

అనకాపల్లి: న్యూకాలనీ రోటరీ హాల్లో ఈనెల 24 రాత్రి 7 నుంచి 9 గంటల వరకూ 'సమాజ అభివృద్ధి–అవినీతి నియంత్రణ' అనే అంశంపై సదస్సు జరుగుతుందని రోటరీ క్లబ్ అనకాపల్లి అధ్యక్షుడు బుద్ధ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ విచ్చేయనున్నట్లు తెలిపారు.

### వ్యాధుల నిర్మూలనకు చర్యలు



బుద్ధ రమణాజీ


అనకాపల్లి: వ్యాధుల నిర్మూలనకు చర్యలు తీసుకుంటామని బుద్ధ రమణాజీ అన్నారు. రోటరీ 3020 వ్యాధుల నిర్మూలన చైర్మన్‌గా గవర్నర్ డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి రమణాజీని నియమిస్తు ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా రమణాజీ మాట్లాడారు. విజయవాడ నుంచి శ్రీకాకుళం వరకు మొత్తం 90 రోటరీ క్లబ్‌లు ఉన్నట్లు తెలిపారు. జిల్లాల్లో ఉన్న అన్ని క్లబ్‌ల అధ్యక్ష, కార్యదర్శులకు వ్యాధుల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రానున్న వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు.

### ఘాటెక్కిన మిర్చి



అనకాపల్లి టౌన్: పచ్చి మిర్చి ఘాటెక్కింది. కూరల్లో వేసి తినకపోయినా, ధర చూస్తేనే మంటెక్కిపోతోంది. వారం రోజులుగా ధర పెరుగుతూ వస్తోంది. వారం క్రితం కిలో పచ్చిమిర్చి రూ.40 ఉండగా సోమవారం అనకాపల్లి మార్కెట్‌లో కిలో రూ.80లకు విక్రయించారు. స్థానికంగా మిర్చి తోటలు లేకపోవడం, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి సరిగ్గా లేకపోవడమే ఒక్కసారిగా ధరల పెరుగుదలకు కారణమని అంటున్నారు. ఈ సీజన్‌లో మిర్చి నిల్వ ఉండదని, త్వరగా పాడైపోవడం కూడా మరొక కారణమని వ్యాపారులు చెబుతున్నారు.

### బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 19 దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| మొదటి రకం | ---- | ---- |
| రెండో రకం | ---- | ---- |
| మూడోరకం | 3,450 | 3,450 |

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| రాజా | మై బేబీ |
| సత్యనారాయణ స్క్రీన్-1 | జూనియర్ |
| సత్యనారాయణ స్క్రీన్-2 | కన్నప్ప |
| పర్తిసాయి | ఓ భామ అయ్యో రామ |
| షిర్డీసాయి | కొత్తపల్లిలోఒకప్పుడు |
| వెంకటేశ్వర | మిస్టర్ రెడ్డి |
| శ్రీ సత్య | ఏమాయి చేసావ్ |
| రామచంద్ర | 3 బీహెచ్‌కే |

### రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 55 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఎ పాజిటివ్-18, బి పాజిటివ్-10, ఒ పాజిటివ్-25 , ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్ (9703613706)ను సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 353 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 298 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924–223595)ని సంప్రదించవచ్చు.

# రూ. లక్షల వ్యయం.. లక్ష్యం శూన్యం

- పల్లెల్లో అస్తవ్యస్తంగా జల్‌జీవన్ మిషన్ పనులు
- పైపులైన్లు వేసి చేతులు దులుపుకొంటున్న కాంట్రాక్టర్లు
- రోడ్డు పక్క ఇళ్లకే కనెక్షన్.. దూరంగా ఉంటే అంతే సంగతులు



మురుగులో మగ్గుతున్న ఇంటింటి కుళాయి కనెక్షన్లు

తుమ్మపాల: మంచినీటి కుళాయి కనెక్షన్ ద్వారా ప్రతి ఇంటికి సురక్షితమైన, తగినంత తాగునీటిని అందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన జల్‌జీవన్ మిషన్ పథకం అమలు లక్ష్యానికి దూరంగా నిలిచిపోయినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. పల్లెల్లో గృహాలకు మెరుగైన సౌకర్యాలతో పాటు నాణ్యమైన మంచినీటి సౌకర్యం కల్పించడంలో పాలకులు, అధికారుల నిర్లక్ష్యం అడుగడుగునా కనిపిస్తోంది. జల్‌జీవన్ మిషన్ పథకం కాంట్రాక్టర్ల కోసమే అమలు జరుగుతున్నట్లు పల్లెల్లో విచ్చలవిడిగా రోడ్లను ధ్వంసం చేస్తూ పైపులను పేర్చుకుపోతున్నారు. పైప్‌లైన్ల ద్వారా కనెక్షన్లు ఇచ్చినా నెలల తరబడి నీటి కోసం ఎదురు చూడాల్సి వస్తోందని గృహిణులు వాపోతున్నారు. ఇంటి ప్రహరీకి కనెక్షన్ ఉన్నా నీరు రాక వీధి కుళాయిల పైనే ఆధారపడాల్సి వస్తోందని, పేరుకే ఇంటింటి కుళాయి కానీ నీటి చుక్క కూడా రావడం లేదంటూ పల్లె ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రోడ్ల పక్కన నిరుపయోగంగా పైపులు..**

మండలంలో దాదాపు అన్ని గ్రామాల్లోను వినియోగంలో లేని పైప్‌లైన్లు వెక్కిరిస్తున్నాయి. జల్‌జీవన్ మిషన్ పథకంలో 70 శాతం మేర ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు మంజూరు చేసినట్లు అధికారులు లెక్కలు చూపిస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో కొన్ని గ్రామాలు మినహా మిగిలిన గ్రామాల్లో కుళాయి కనెక్షన్ల గుండా చుక్క నీరు కూడా రావడం లేదు. నీరు రాకపోయినా మాకేం సంబంధం లేనట్లు కాంట్రాక్టర్లు వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లకు ఆనుకుని పైపులైన్లు ఏర్పాటు చేసి అక్కడే మూడు మీటర్ల పొడవు గల అంగుళం పైపు కనెక్షన్లు తగిలించేసి చేతులు దులుపుకుంటున్నారు. కుళాయిలు ఉన్నా నీరు రాకపోవడంతో ప్రజలు మంచినీటి కోసం తీవ్ర వెతలు పడుతున్నారు. ఆర్థిక స్థోమత ఉన్నవారు సొంత నగదుతోను, మరికొందరు అప్పులు చేసి బోర్లు వేసుకుంటున్నారు. నిరుపేదలు దిక్కు తోచని స్థితిలో ప్రైవేటు వాటర్ ప్లాంట్ల వద్ద డబ్బాలతో లీటర్ల లెక్కన నీటిని కొనుగోలు చేసుకుని రోజులు గడుపుతున్నారు. నీటి కొరత కారణంగా మండలాల్లో ప్రతి గ్రామంలోను కనీసం రెండు వాటర్ ప్లాంట్లు పుట్టుకొచ్చాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.



రేబాకలో జల్‌జీవన్ మిషన్ పైప్‌లైన్ కోసం ధ్వంసం చేసిన సీసీ రోడ్డు

**మూడు మీటర్లకే జల్‌జీవన్ కుళాయి..**

గ్రామాల్లో ఇప్పటికీ సరైన రోడ్లు, బాటలు లేవు. అయితే జల్ జీవన్ మిషన్ పథకంలో కాంట్రాక్టర్లు కేవలం సీసీ రోడ్ల పొడవున పైప్ లైన్లు అమర్చి వాటి నుంచి కేవలం మూడు మీటర్ల పొడవు గల కుళాయి కనెక్షన్ బిగిస్తున్నారు. దూరంలో ఉన్న ఇళ్ల వారు సొంత ఖర్చుతో పైప్‌లైన్లు వేసుకోవాల్సి వస్తోంది. పలు గ్రామాల్లో ఇలాంటి దృశ్యాలు కోకొల్లలుగా దర్శనమిస్తున్నాయి. సీసీ రోడ్డుకు దూరంగా ఉన్న ఇళ్లకు కనెక్షన్లు వేయకుండా సీసీ రోడ్డు వద్దే పదుల కొద్దీ కనెక్షన్లు ఏర్పాటు చేసి కాంట్రాక్టర్లు పైపులను వదిలేస్తున్నారు. వాటిని పట్టించుకునే నాథుడు లేకపోవడంతో పైపులు మురుగునీటిలో కలిసిపోతున్నాయి.



కనెక్షన్ కోసం రోడ్డు పక్కన ఏర్పాటు చేసి వదిలేసిన పైపులు

**మురుగులోనే పైప్‌లైన్లు..**



ఇంటింటికీ కుళాయి పేరుతో కాంట్రాక్టర్లు ప్రభుత్వ సొమ్మును దోచుకుంటున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో ఉన్న కుళాయిలను రద్దు చేసి జల్‌జీవన్ మిషన్ ద్వారా నూతన పైప్‌లైన్లు వేస్తున్నారు. రోడ్ల పక్కన వేసిన పైప్‌లైన్లు అక్కడే వదిలేయడంతో అపారిశుధ్యం ఏర్పడుతోంది. గ్రామాల్లో వందల్లో కనెక్షన్లు మురుగులోనే ఉన్నాయి. సరైన పర్యవేక్షణ లేక కేంద్ర ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది.

– జి.రాము, శంకరం గ్రామం

### పశువైద్య కేంద్రం తనిఖీ



నరసింగబిల్లిలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా పశు సంవర్ధక శాఖ ఏడీ చంద్రశేఖర్

కశింకోట: ఉపాధి హామీ పథకం ద్వారా గడ్డి సాగు చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ ఎం. చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని నరసింగబిల్లి పశు వైద్య కేంద్రాన్ని మంగళవారం పరిశీలించిన ఆయన కేంద్రం పని తీరును, రికార్డులను తనిఖీ చేశారు. స్టాక్ పుస్తకాలు, వైద్య సేవల నమోదు వివరాల పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సలహాలు, సూచనలిచ్చారు. పశువులకు సెక్స్ సార్టెడ్ వీర్యం వాడకం, ప్రయోజనాలు, లభ్యతపై పాడి రైతులకు అవగాహన కలిగించాలన్నారు. గ్రామీణ రైతులకు మరింత సమర్థవంతంగా సేవలందించడానికి కృషి చేయాలని సూచించారు. ప్రస్తుతం సంకర జాతి పశువులకు వేస్తున్న థైలేరియాసిస్ వాక్సినేషన్ కార్యక్రమం, మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమం ఎలా నిర్వహిస్తున్నారనే విషయమై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి ఆల్ఫోన్సా జార్జ్ పాడి రైతులకు పశు సంవర్ధక శాఖ ద్వారా అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో పాటు సాంకేతిక అవగాహన పెంపొందించడానికి కృషి చేస్తున్నామని ఆయనకు తెలిపారు.

### పూర్వ విద్యార్థుల సేవా నిరతి



తాతారావు కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కశింకోట: ఇద్దరు విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు కశింకోటలోని డీపీఎన్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 2001–02 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు. మృతి చెందిన సహ విద్యార్థి చెవ్వేటి తాతారావు కుటుంబానికి రూ.25,500, అనారోగ్యంతో బాధపడుతున్న సహ విద్యార్థి కనిశెట్టి నరేష్‌కు రూ.30 వేలు ఆర్థిక సాయం అందించారు. స్నేహ హృదయంతో అందించిన సహకారానికి బాధిత కుటుంబాలతో పాటు స్థానికులు పూర్వ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## తాగునీటి పైప్‌లైన్లకు మరమ్మతులు



నాగవంశం వీధిలో పైపులైన్ పనులు చేయిస్తున్న జాజుల రమేష్

అనకాపల్లి: పరిశుభ్రమైన తాగునీటిని అందించి, ప్రజలు వ్యాధుల బారిన పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ అన్నారు. 83వ వార్డు పరిధి నాగావంశం వీధిలో రెండేళ్లుగా మినీ వాటర్ ట్యాంక్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే తాగునీటి పైపులు మరమ్మతుకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రమేష్ జీవీఎంసీ నీటి పారుదల విభాగం సిబ్బందితో ఆ పైపులను బాగు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్న కారణంగా ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే వేడి నీరు మాత్రమే తాగాలన్నారు. జ్వరం, దగ్గు వంటి సమస్యలు ఉంటే దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు కారుకుండి కన్న బాబు, కండుబోతు రాంబాబు, కండుబోతు వాసు, కండిపల్లి శ్రీను, దొడ్డి హేమంత్ పాల్గొన్నారు.

## భూ వివాదంలో 19 మంది బైండోవర్

కశింకోట: మండలంలోని పరవాడపాలెం వద్ద భూ వివాదంలో 19 మందిని మంగళవారం బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు. సుమారు 4.50 ఎకరాల ఈనాం భూమి విషయమై రెండు వర్గాలు తమదంటే తమదని గొడవ పడుతూ ఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయమై విచారించి ముందు జాగ్రత్తగా రెండు వర్గాలను హాజరు పర్చగా తహసీల్దార్ తిరుమలరావు బైండోవర్ చేశారన్నారు.

## మంచి విత్తనాలతోనే మెరుగైన ఫలితం



వ్యవసాయ అధికారి రంగాచారి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అనకాపల్లి: ఖరీఫ్ సీజన్‌లో నారుమడులు వేసుకునే రైతులు మంచి విత్తనాలు వినియోగించాలని మండల వ్యవసాయ అధికారి పి.బి.రంగాచారి అన్నారు. వెంకుపాలెం, సీతానగరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట దిగుబడి తగ్గడానికి కారణాలు, వరిలో విత్తన శుద్ధి గురించి రైతులందరూ తెసుకోవాలన్నారు. నారుమడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వరి నారుమడిలో జింక్ లోపం తలెత్తుతుందని, దీని నివారణకు లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ మందు స్ప్రే చేయాలని, నాలుగు సెంట్ల నారుమడికి 2 కేజీల ముడి జింకు రెండు కేజీల ఇసుకలో కలిపి పొలంలో చల్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామస్తులకు కిడ్నీ స్క్రీనింగ్ పరీక్షలు



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

అనకాపల్లి టౌన్: మండలంలోని సీహెచ్ఎన్ అగ్రహారం గ్రామంలో గ్రామస్తులకు కిడ్నీ సంబంధిత సమస్యలపై ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ గ్రామస్తులందరూ తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, తుమ్మపాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వాణి జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## 'కూటమి' వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- వచ్చే వారం నుంచి గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కుమార్



మాట్లాడుతున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: ప్రజలకు హామీలిచ్చి, అమలు చేయని కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ ' కార్యక్రమాన్ని వచ్చే వారం నుంచి గ్రామీణ స్థాయి నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. స్థానిక రింగ్‌రోడ్డులోని కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో పార్టీ ముఖ్యనేతలతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో అధికారం చేపట్టిన వెంటనే 2024 జూన్ నుంచి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని స్వయంగా ఇంటింటికీ కూటమి నేతలు వెళ్లి బాండ్ పేపర్లు రాసి ఇచ్చారని, ఏడాది దాటిపోయినా వాటిని అమలు చేయడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. పథకాల అమలుకోసం ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాడుతుందన్నారు.

**వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి..**

వైఎస్సార్‌సీపీ పాలనలో అనకాపల్లి కేంద్రంగా జిల్లా ఏర్పాటైందని, దీనిలో భాగంగా పట్టణంలో గాంధీబొమ్మ జంక్షన్ నుంచి పెరుగుబజార్ జంక్షన్ వరకూ రహదారి విస్తరణ పనులు చేపట్టారని చెప్పారు. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో రహదారి విస్తరణలో గృహాలు కోల్పోయిన కొంత మంది టీడీఆర్‌లు తీసుకోలేదని, కూటమి ప్రభుత్వం వారికి టీడీఆర్ ఇచ్చి, రహదారి విస్తరణ పనులు చేపట్టాలని ప్రజల పక్షాన పోరాటాలు చేస్తుంటే వ్యక్తిగత విమర్శలు చేయడమేంటని ప్రశ్నించారు. కూటమి నాయకులు వ్యక్తిగత విమర్శలు మానుకుని, అభివృద్ధి, సంక్షేమ పథకాలపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. త్వరలో కూటమి నాయకులకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, సమయం కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో మైనింగ్ మాఫియా అంతా కూటమి నాయకుల చేతుల్లోనే జరుగుతోందని, మైనింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మలసాల కుమార్‌రాజా, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, 80, 84 వార్డుల ఇన్‌చార్జిలు కేఎం.నాయుడు, కోరుకొండ రాఘవ, నూకాంబిక దేవస్థానం మాజీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, గవర కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, అనకాపల్లి, కశింకోట మండల మహిళా విభాగం అధ్యక్షులు పద్మకుమారి, తగరంపూడి నూకరత్నం, కోడూరు సర్పంచ్ శ్రీను, పార్టీ నాయకులు మరిపల్లి శోభ, కొంకి శ్రీరామ్మూర్తి, పీలా శ్యామ్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## బంగారం షాపుల ఎదుట సీసీ కెమెరాలు తప్పనిసరి

అనకాపల్లి టౌన్: ప్రతి బంగారు షాపు ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని బంగారు షాపుల యజమానులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనాలను అరికట్టడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బంగారు వర్తకులు పాల్గొన్నారు.

## వ్యవసాయ పరిశోధనా స్థానం సందర్శన



ఆర్ఏఆర్ఎస్‌ను సందర్శించిన డిగ్రీ కళాశాల విద్యార్థులతో అధ్యాపకులు

అనకాపల్లి టౌన్: స్థానిక ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం అనుబంధ సంస్థ అయిన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాన్ని డాక్టర్ హిమశేఖర్ డిగ్రీ కళాశాల బీఎస్సీ విద్యార్థులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ దాడి ఉమామహేశ్వరరావు కళాశాల విద్యార్థులకు బయో ఫెర్టిలైజర్ లేబొరేటరీ, భూసార పరీక్షా కేంద్రం, రసాయన ప్రయోగశాలలను చూపించి వాటి ఉపయోగాలను వివరించారు. ప్రిన్సిపాల్ సైంటిస్టులు డాక్టర్ విశాలాక్షి, డాక్టర్ శిరీష, డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏఆర్ఎస్ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, కరస్పాండెంట్ కొణతాల సౌరభ్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## సెక్రటరీల పనితీరు సమీక్షిస్తాం



మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ చక్రవర్తి

అనకాపల్లి టౌన్: సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న సెక్రటరీల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తాం అని జోనల్ కమిషనర్ చక్రవర్తి తెలిపారు. స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో మంగళవారం సచివాలయ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్రటరీలు సక్రమంగా విధులు నిర్వర్తించాలని అలక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, టీపీవో కె. వెంకట్రావు, డీఈఈ వేణుగోపాలరావు, ఏడీపీ వై. సంతోష్ పాల్గొన్నారు.

## కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్‌కు ఘన నివాళి

అనకాపల్లి: స్థానిక సీపీఎం కార్యాలయంలో కేరళ మాజీ సీఎం వి.ఎస్.అచ్యుతానందన్ మృతికి నాయకులు సంతాపం ప్రకటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు, గంటా శ్రీరామ్, కె.తేలయ్యబాబు, ఇతర నాయకులు అచ్యుతానంద్ చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. నూట రెండేళ్ల నిండు జీవితం గడిపిన వీఎస్ ఎనిమిదిన్నర దశాబ్దాలకు పైగా ఉద్యమ జీవితానికే అంకితమయ్యారని, కేరళలో కమ్యూనిస్టు ఉద్యమ అభివృద్ధిలో ఆటుపోట్లన్నింటినీ దగ్గరగా చూసిన యోధుడాయన అన్నారు. కేరళలో కమ్యూనిస్టు ఉద్యమ వ్యవస్థాపకుడు పి.కృష్ణ పిళ్లైను కలుసుకున్న తర్వాత ఆయన జీవితం పెద్ద మలుపు తిరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.ఉమామహేశ్వరరావు, నాయకులు కె.ఈశ్వరరావు, పి.చలపతి, నాగిరెడ్డి సత్యనారాయణ, బి.నూక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా మూగజీవాల నీళ్ల కుండీ



తుమ్మపాలలో తుప్పల మధ్య ఉన్న మూగజీవాల మంచినీటి కుండీ

అనకాపల్లి టౌన్: తుమ్మపాలలో మూగజీవుల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన సిమెంట్ కుండీ నిరుపయోగంగా కనిపిస్తోంది. నిత్యం నీటితో నింపాల్సిన కుండీలో సరిగ్గా నీళ్లే ఉండటం లేదు. కుండీ చుట్టూ తుప్పలు పేరుకుపోవడంతో కనీసం కుండీ దగ్గరకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అసలు మండల పరిధి 32 పంచాయతీల్లోని ఎన్ని గ్రామాల్లో ఈ మంచినీటి కుండీలు నిర్మించారు? వాటికి ఎంత నిధులు కేటాయించారో కూడా అధికారులు చెప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, మూగజీవాల కోసం నిర్మించిన మంచి నీటి కుండీలను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

## ప్రకృతి సేద్యంతో పెట్టుబడి ఆదా



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ అధికారులు

కశింకోట: రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించి పంటలను సాగు చేయడంపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న సూచించారు. దీనివల్ల పెట్టుబడి ఖర్చులు ఆదా అవుతాయన్నారు. మండలంలోని తీడ, చెరకాం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన 'పొలం పిలుస్తుంది' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చెరకు, బొప్పాయి, అరటి, వరి పొలంలో దశపర్ణి కషాయం, అగ్నాస్త్రం, మీనామృతం పిచికారి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వరి నారుమడులను పరిశీలించారు. వీటిలో జింకు లోపం ఉందని గుర్తించారు. దీని నివారణకు ఆవు పేడ, మూత్రం, ఇంగువ మిశ్రమ ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం నిర్వాహకురాలు కూండ్రపు అరుణ, మండల ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జి అప్పారావు, వ్యవసాయ శాఖ ప్రతినిధి వీపీ కిషోర్, రైతులు పాల్గొన్నారు.